రోజుకు 258 కంపెనీలు మూత

బీజేపీ హయాంలో 9,31,644 కంపెనీలకు తాళం

- ఇదే సమయంలో 5 కోట్ల మంది ఉద్యోగాలు గాయబ్
- ప్రభుత్వరంగ సంస్థలను బలిపెట్టిన బీజేపీ ప్రభుత్వం
- పీఎస్‌యూల విక్రయాలు 72% మోదీ హయాంలోనే
- నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు చాట్‌బాట్ గ్రోక్ జవాబులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: చెప్పే మాటలకూ చేసే చేతలకూ సంబంధం లేదని కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు నిరూపించుకొన్నది. ఉద్యోగాలిస్తామన్న హామీలకు భిన్నంగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టే చర్యలు చేపట్టింది. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని గాలికొదిలేసి.. ఉన్న కంపెనీలకు తాళాలు పడే పరిస్థితిని తీసుకువచ్చింది. కొత్త పరిశ్రమల ఏర్పాటు లేదు. ప్రభుత్వరంగ సంస్థల్ని (పీఎస్‌యూ) అగ్గువ సగ్గువకు అమ్మకానికి పెట్టింది. ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటనలకే పరిమితం చేసింది. మోదీ పదకొండేండ్లపాలనలో దేశంలో పారిశ్రామికరంగం అతలాకుతలమైంది. 'మేకిన్ ఇండియా' నినాదం, కంపెనీలు, పీఎస్‌యూలు, ఉద్యోగాలకు సంబంధించి అడిగిన పలు ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' సంచలనమైన వివరాలను వెల్లడించింది. బీజేపీ ప్రభుత్వ డొల్ల విధానాలను గణాంకాలతో సహా బయటపెట్టింది.

నెరవేరని 'మేకిన్ ఇండియా' లక్ష్యం

అధికారంలోకి వచ్చిన తొలిన్నాళ్లలో మోదీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన 'మేకిన్ ఇండియా' నినాదం కాస్తా 'జోకిన్ ఇండియా'గా మారింది. ఎప్పటి నుంచో దేశానికే వన్నె తెచ్చిన పరిశ్రమలెన్నో నేడు అవసానదశకు చేరుకున్నాయి. 'మేకిన్ ఇండియా' స్కీమ్ లక్ష్యాలను చేరుకొన్నదా? అనే ప్రశ్నను అడగ్గా.. లేదంటూ గణాంకాలతో సహా 'గ్రోక్' వివరించింది. 2022నాటికి జీడీపీలో తయారీరంగం వాటాను 25శాతానికి పెంచాలని మేకిన్ ఇండియాలో లక్ష్యంగా పెట్టుకోగా, 15.9 శాతానికే పరిమితమైనట్టు వివరించింది. 2022నాటికి తయారీ రంగంలో 10 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పిస్తామంటూ 'మేకిన్ ఇండియా' లక్ష్యంగా నిర్ణయించగా.. ఆరేండ్లలో తయారీ రంగంలో 1.57 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు 'గ్రోక్' కుండబద్దలు కొట్టింది. సీఎంఐఈ, పీఎల్ఎఫ్ఎస్ డాటా ప్రకారం.. బీజేపీహయాంలో 5 కోట్ల మంది ఉద్యోగాలు పోగొట్టుకొన్నట్టు వివరించింది. ఎఫ్‌డీఐ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయాల్లోనూ 'మేకిన్ ఇండియా' లక్ష్యాలను బీజేపీ ప్రభుత్వం చేరుకోలేదన్న గ్రోక్.. ఒక విధంగా ఇదో వైఫల్య స్కీమ్‌గా అభివర్ణించింది.

బజారున పడ్డ కార్మికులు

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోని మోదీ.. కనీసం ప్రైవేట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలు మూత పడకుండా చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేంద్రంలో 2014 నుంచి 2024 మార్చి 31 నాటికి 9,31,644 రిజిస్టర్డ్ కంపెనీలు మూతపడినట్టు 'గ్రోక్' వెల్లడించింది. ఫలితంగా కోట్లాదిమంది కార్మికులు, ఉద్యోగులు బజారున పడ్డారని ఆందోళన వ్యక్తం చేసింది. డాటా పుల్ నివేదికను అనుసరించి గ్రోక్ చెప్పిన వివరాల ప్రకారం.. మూతపడిన రిజిస్టర్డ్ కంపెనీలలో అత్యధికం సేవలరంగానివే. సర్వీస్ సెక్టార్‌లో 28%, తయారీ రంగంలో 24%, ట్రేడింగ్‌లో 11%, నిర్మాణరంగంలో 10 కంపెనీలు మూతపడ్డాయి. ఇతర రంగాల్లో మరో 27% వరకు ఉన్నాయి. ఇక, కరోనా కాలంలో లాక్‌డౌన్ కారణంగా కంపెనీలు మూతపడటంతో తీవ్రంగా నష్టపోయిన కంపెనీల ఉద్దీపనకు రూ.16 లక్షల కోట్ల ఆర్థిక సాయం అందించడానికి నిధి ఏర్పాటు చేస్తామని మోదీ ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

ప్రభుత్వరంగంపై చావుదెబ్బ

'ప్రభుత్వరంగ సంస్థలను నడపించాల్సిన అవసరం, అవశ్యకత ఎంత మాత్రమూ లేదు. అది అసంభవం కూడా' పీఎస్‌యూల అంశంపై 2021 జూన్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన వెబ్‌నార్‌లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలివి. తన వ్యాఖ్యలకు అనుగుణంగానే ప్రభుత్వ రంగ సంస్థలను (పీఎస్‌యూ)తెగనమ్మడం, సంస్థల్లోని పెట్టుబడులను ఉపసంహరించుకోవడంలో మోదీ ప్రభుత్వం కొత్త రికార్డులను సృష్టించింది. 2014 నుంచి 2024 మధ్యలో మొత్తం 179 పీఎస్‌యూలను విక్రయించడం లేదా పెట్టుబడులను ఉపసంహరించడం ద్వారా కేంద్రం రూ. 4.48 లక్షల కోట్లను అర్జించినట్టు ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు 'గ్రోక్' సమాధానమిచ్చింది. 1991 నుంచి ఇప్పటివరకూ జరిగిన పీఎస్‌యూల విక్రయాల్లో 72 శాతం మోదీ హయాంలోనే జరిగినట్టు గ్రోక్ తేల్చిచెప్పింది. ఎయిరిండియా, బీపీసీఎల్, ఎస్సీఐ, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ తదితర పీఎస్‌యూలను మొత్తంగా లేదా కొంత మేర వాటాను బీజేపీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టినట్టు వివరించింది.

బీజేపీపాలనలో కంపెనీలు మూత ఇలా..

పదేండ్లలో	ఏడాదికి
9,31,644	93,164
నెలకు: 7,763	రోజుకు: 258

కంపెనీలు మూత ఏ రంగంలో ఎన్ని?

సర్వీస్ సెక్టార్ 28 శాతం	తయారీ రంగం 24 శాతం
ట్రేడింగ్ 11 శాతం	నిర్మాణరంగం 10 శాతం
ఇతర రంగాలు 27 శాతం	

ఐదు లక్షలిస్తేనే టీచర్ ఉద్యోగం?

- బేరంపెట్టిన విద్యాశాఖ ఆఫీసర్స్
- డీఎస్సీ-2002 నియామకాలకు అభ్యర్థుల నుంచి లంచం డిమాండ్
- అప్పట్లో అనర్హులకు ఉద్యోగాలు
- తాజాగా బాధితులకు ఉద్యోగాలివ్వాలని కోర్టు తీర్పు
- ఉద్యోగాలిచ్చేందుకు రూ.5లక్షలు డిమాండ్ చేసిన ప్రబుద్ధులు
- విద్యాశాఖ డైరెక్టరేట్‌కు నివేదిక
- నివేదిక మార్చాలంటూ ఒత్తిళ్లు

కరీంనగర్ కమాన్ చౌరస్తా, హైదరాబాద్ ఏప్రిల్ 5: (నమస్తే తెలంగాణ): 'డీఎస్సీ పరీక్షలో ఎక్కువ మార్కులొచ్చాయి. మెరిట్ ఉన్నది. కానీ, టీచర్ ఉద్యోగం దక్కలేదు. చేయి దాకా వచ్చిన ఉద్యోగం చేజారింది. ఆ అభ్యర్థి తిరగని ఆఫీసులేదు. ఎక్కని మెట్టులేదు. ఈ ప్రయత్నంలో ఉద్యోగమైతే దక్కలేదు కానీ, మానసిక రోగి (పిచ్చివాడు) అయిపోయాడు' ఇలాంటి బాధితులెందరో! ఇలాంటి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ కరీంనగర్ జిల్లా. ఇది జరిగింది డీఎస్సీ-2002లో. బాధితులకు ఉద్యోగాలివ్వాలని హైకోర్టు ఇటీవలే తీర్పునిచ్చింది. ఉద్యోగాల కోసం వెళ్తే రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఉద్యోగాలిస్తామంటూ విద్యాశాఖలోని కొందరు బేరంపెట్టారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

డీఎస్సీ-2002లో భారీ అక్రమాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డీఎస్సీ-2002లో అక్రమాలు జరిగాయి. అర్హులను పక్కన పెట్టి అనర్హులకు పోస్టులు కట్టబెట్టారు. హిందీ పండిట్ పోస్టుల భర్తీలో విచారణ చేపడితే 50కిపైగా పోస్టుల భర్తీలో ఉల్లంఘనలు జరిగినట్టు నిరూపితమైంది. 24 మందివి బోగస్ సర్టిఫికెట్లుగా గుర్తించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలోనూ అక్రమాలు జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. 49 హిందీ పండిట్ గ్రేడ్-2 పోస్టులు, 85 ఎస్జీటీ తెలుగు మీడియం పోస్టులు, 5 ఎస్ఏ గణితం పోస్టుల ఎంపికలో అవకతవకలు జరిగాయి. అప్పట్లో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ విచారణ జరిపి, నివేదికను విద్యాశాఖకు సమర్పించారు. అక్రమాలు నిజమేనని తేలడంతో 63 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు.

నివేదికను మార్చాలంటూ ఒత్తిళ్లు

డీఎస్సీ-2002లో జరిగిన అక్రమాలపై జిల్లాలో ఐదుగురు అధికారులతో కమిటీ నివేదిక రూపొందించింది. ఈ నివేదిక ఇటీవలే విద్యాశాఖకు చేరింది. డైరెక్టరేట్‌లో శిష్యులైన ఉన్నతాధికారులు గురుభక్తిని ప్రదర్శించి నివేదిక బయటికి రాకుండా అడ్డుకున్నట్టు సమాచారం. అప్పట్లో ఇన్‌చార్జి డీఈవోగా పనిచేసిన ఒక అధికారి.. విద్యాశాఖ డైరెక్టరేట్‌లో కీలకంగా వ్యవహరించారు. సదరు అధికారి అన్నీ తానై వ్యవహరించారు. ఆయన శిష్యులే ఇప్పుడు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో కీలకంగా ఉన్నారు. దీంతో గురుభక్తితో ఆ నివేదికను తొక్కిపెట్టినట్టు, నివేదికను మార్చి రాయాలని ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇంతకంటే దారుణం ఉంటుందా?

తమకు జరిగిన అన్యాయంపై బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. 2024 ఏప్రిల్‌లో అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. 22 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఉద్యోగాలొస్తాయని అభ్యర్థులు ఆశగా ఎదురుచూశారు. హైకోర్టు తీర్పు ఇచ్చి ఏడాది అవుతున్నది. కానీ, ఇంకా ఉద్యోగాలివ్వలేదు. దీనిపై కరీంనగర్ జిల్లా నుంచి నివేదిక అందలేదంటూ మెలికపెట్టారు. జిల్లా అధికారుల నుంచి నివేదిక అందిన తర్వాత తొక్కిపెట్టడమే కాకుండా మార్చి రాయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఒక అధికారి నివేదికను తయారుచేసిన అధికారిని చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. ఇంత వివరంగా ఎవరు రాయమన్నారు అంటూ ఫైర్ అయినట్టు వార్తలొస్తున్నాయి. కోర్టు తీర్పునిచ్చినా ఉద్యోగ నియామకాలు ఆలస్యం కావడంతో కొందరు అభ్యర్థులు విద్యాశాఖ డైరెక్టరేట్‌లోని ఒక ఉద్యోగిని సంప్రదించగా, రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఉద్యోగాలిస్తామని బేరం పెట్టినట్టు ఆరోపిస్తున్నారు.

తెలంగాణకు కేంద్రం తీరని అన్యాయం

- రాష్ట్రంలో కాంగ్రెస్‌ది విఫల సర్కార్
- సంగమేశ్వర, బసవేశ్వర పథకాల కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- బీఆర్ఎస్‌లో పలువురు బీజేపీ నాయకుల చేరిక

హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జహీరాబాద్ బీజేపీ నాయకులు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ)/జహీరాబాద్: తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, తాజా బడ్జెట్‌లో నయాపైసా కేటాయించకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం జహీరాబాద్ ఎమ్మెల్యే కే మాణిక్‌రావు ఆధ్వర్యంలో ఝరాసంగం, కోహీర్ మండలాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీడీసీ మాజీ చైర్మన్ ఉమకాంత్ పాటిల్, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బస్వరాజ్, మాజీ ఎంపీటీసీలు విజేందర్‌రెడ్డి, సంతోష్‌పాటిల్, సీనియర్ నాయకులు భూమయ్య, సుభాశ్‌రావు, లక్ష్మయ్యతోపాటు 20 మందికి పైగా ముఖ్య నాయకులకు హరీశ్‌రావు గులాబీ కండువాలను కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ఎలాంటి మేలు చేయడం లేదని ధ్వజమెత్తారు. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ చిన్నచూపు చూస్తున్నదని, విభజన హామీలను అమలు చేయకుండా చట్టాలను ఉల్లంఘిస్తున్నదని మండిపడ్డారు. ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని తుక్కు కింద కేంద్ర ప్రభుత్వం అమ్ముతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సంగారెడ్డి జల్లా అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. ఎన్డీఎఫ్, టీపీఐడీసీ నిధులను విడుదల చేయకుండా అన్యాయం చేస్తున్నదని చెప్పారు.

సంగారెడ్డి జిల్లాకు కాంగ్రెస్ అన్యాయం

సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ శంకుస్థాపన చేసిన బసవేశ్వర, సంగమేశ్వర పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనబెట్టి జిల్లాకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడిని తెచ్చేందుకు త్వరలోనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ సీనియర్ నేత నామ రవికిరణ్ పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూప్‌ల్లోకి పోలీసులు?

మొదటిపేజీ తరువాయి...

కిందిస్థాయి హోంగార్డు, కానిస్టేబుళ్ల వరకూ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే స్టేషన్ల పరిధిలోని గ్రామాలపై కానిస్టేబుళ్లు, హోంగార్డులు వాట్సాప్ గ్రూపుల వేటలో నిమగ్నమైనట్టు తెలిసింది.

'అన్నా.. మీ గ్రూప్‌లలో యాడ్ చేయండి..'

గ్రామాల నుంచి ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వస్తే.. 'మీ గ్రామంలో ఎన్ని వాట్సాప్ గ్రూపులు ఉండొచ్చు. పార్టీల గ్రూపులు, ఊరి అభివృద్ధి గ్రూపులు, కులాల వారీగా, మతాల వారీగా, యూత్ గ్రూప్‌లు, ఇంటిపేర్లతో ఉన్న గ్రూపులు, దావత్‌ల గ్రూపులు ఎన్ని ఉన్నాయి? వాటి అడ్మిన్‌లు ఎవరు? కొంచెం వివరాలు చెప్పండన్నా.. వాటిల్లో మమ్మల్ని కూడా యాడ్ చేయండి' అంటూ పోలీసులు బతిమాలుకుంటున్నట్టు తెలిసింది. గ్రామాలు, పట్టణస్థాయి, రాష్ట్రస్థాయి గ్రూపుల్లో ఏమేం జరుగుతున్నదో తెలుసుకునే బాధ్యతను ఆయా స్టేషన్ల పరిధిలోని కానిస్టేబుళ్లు, ఇంటెలిజెన్స్ సిబ్బంది, టాస్క్ ఫోర్స్ సిబ్బంది భుజాన వేసుకున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో త్వరగా చేరడానికి మండలస్థాయి, గ్రామస్థాయిలోని కాంగ్రెస్ నాయకుల సహకారం తీసుకోవాలని పరోక్షంగా ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

టార్గెట్ 3 లక్షల గ్రూపులు..?

తెలంగాణలో 12,848 గ్రామాలు ఉండగా.. వాటికి ఆవాస గ్రామాలు కలిపి 13వేల పైచిలుకు ఉన్నాయి. వీటిల్లో ఒక్కో గ్రామంలో కనీసం విలేజ్ గ్రూపు-1, కులాల వారీగా-8, పార్టీల గ్రూపులు -4, మతాల వారీగా - 2, ఇంటిపేరిట-5-10, దావత్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్-2-5 వరకు మొత్తంగా 20 వాట్సాప్ గ్రూప్‌లున్నాయి. ఇక నగరాలు, మండలాలు, జిల్లా కేంద్రాల్లోని వార్డుల వారీగా గ్రూపులు, నిరుద్యోగుల గ్రూపులు, విద్యా సమాచారం గ్రూపులు, జర్నలిస్టుల గ్రూపులు, దినపత్రికల గ్రూపులు, ఆఖరికి డ్రంక్ అండ్ డ్రైవ్ గ్రూపులు మొత్తం కలిపితే.. సుమారు 5.50 లక్షల పైగానే ఉంటాయని పోలీసుశాఖ అంచనాకు వచ్చినట్టు సమాచారం. వీటిల్లో కనీసం 3 లక్షల గ్రూపుల్లోని సమాచారం హెడ్ ఆఫీసుకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే ఇందుకు ప్రత్యేకంగా ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వ పెద్దలు నిర్దేశించినట్టు తెలిసింది.

విశ్రాంత ఉద్యోగుల స్థానాల్లో ఇన్‌చార్జులేరి?

- వారం రోజులుగా ఖాళీగా కీలక స్థానాలు
- నిలిచిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో కొనసాగింపుపై పనిచేస్తూ వచ్చిన విశ్రాంత ఉద్యోగులను తొలగించిన రాష్ట్ర సర్కారు.. వారి బాధ్యతలను ఇతర అధికారులకు అప్పగించడంలో తాత్సారం చేస్తున్నది. తొలగించిన రిటైర్డ్ ఉద్యోగుల స్థానంలో ఇన్‌చార్జులను నియమించకపోవడంతో ఫైళ్లు పేరుకుపోయి, పనులు పడకేశాయి. కీలకస్థానాల్లో ఉన్నవారిని సైతం పక్కన పెట్టడంతో ఆయా శాఖల కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) నుంచి 177 మంది విశ్రాంత ఉద్యోగులను ప్రభుత్వం తొలగించింది. ఆ జాబితాలో అటెండర్ నుంచి ఐఏఎస్ అధికారి వరకు ఉన్నారు.

కీలక స్థానాలైనా నింపరా?

వైటీడీఏ వైస్ చైర్మన్, ఎండీ కిషన్‌రావు, మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ సీఈఈ డీవీఎస్ రాజు, వాటర్‌బోర్డులో సత్యనారాయణ, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు ఇలా.. ప్రధాన శాఖల్లో కీలక వ్యక్తుల స్థానాలు ఖాళీగా ఉండటంతో కార్యకలాపాలు స్తంభించాయి. గతంలో ఏ ఉద్యోగిని అయినా తొలగిస్తే లేదా బదిలీ చేస్తే వెంటనే ఇన్‌చార్జిగా మరో వ్యక్తికి బాధ్యతలు అప్పగించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు.

ఉద్యోగులపై స్పష్టత కరువు

ఏదైనా శాఖలో అయినా విశ్రాంత అధికారి లేదా ఉద్యోగి సేవలు అత్యవసరం అనుకుంటే, ఆ శాఖ అధిపతి ఇచ్చే వివరణను పరిశీలించి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలా? వద్దా? అనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటున్నదని మార్చి 25న సర్కారు ఉత్తర్వుల్లోనే తెలిపారు. తొలగించిన 6,729 మందిలో తిరిగి నియామకం అయ్యే అవకాశం ఉన్న వ్యక్తులు పలువురు ఉంటారని సచివాలయవర్గాల్లో చర్చ నడుస్తున్నది. కానీ వారం గడుస్తున్నా నిర్ణయం తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

కారడవిలో పాగాకు ముంజేతి కడియం!

మొదటిపేజీ తరువాయి...

పార్టీలోని పలుకుబడి ఉన్న వారు వేల ఎకరాలను స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఫిర్యాదు చేసిన రైతుల చేతికి భూములు చేరగానే స్థానిక ముఖ్యనేత బంధువుకు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. అటవీ భూముల్లోనే తమ పట్టా భూములు ఉన్నాయని, ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని అభ్యర్థిస్తూ ఇటీవల కొంతమంది స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం ఇచ్చారు. కడియం వెంటనే హనుమకొండ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు న్యాయం చేయాలనే ఎమ్మెల్యే ప్రతిపాదనపై కలెక్టర్ వేగంగా స్పందించారు. మార్చి మొదటి వారంలో దేవునూరు గుట్టలను సందర్శించారు. మార్చి 12న రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టా ఉన్న రైతులకు అటవీ ప్రాంతంలోని భూములను అప్పగించాలని, ఇనుపరాతి గుట్టల నుంచి ఖాళీ చేయాలని హనుమకొండ జిల్లా అటవీ శాఖ అధికారికి మార్చి 27న ఆదేశాలు జారీ చేశారు. ఆ మరుసటి రోజు నుంచి అటవీ సంపదను ధ్వంసం చేసే ప్రణాళికలు వేగంగా రూపొందాయి. రెండు రోజులుగా బుల్డోజర్లతో ఈ ప్రక్రియ జరుగుతున్నది. దశాబ్దాలుగా అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూమిని ప్రైవేటు వారికి అప్పగించేందుకు కలెక్టర్ హడావుడి చేయడంపై విమర్శలొస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోని స్థలంలోనూ చెట్లు, అటవీ సంపద ఉంటే ప్రభుత్వ అనుమతితోనే తీసివేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ, ఇనుపరాతి గుట్టల ప్రాంతంలో మాత్రం జిల్లా ఉన్నతాధికారులే అటవీ సంపదను ధ్వంసం చేస్తున్నారు. రెండున్నర వేల ఎకరాల అడవిని చదును చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

హనుమకొండ జిల్లాలోని ఇనుపరాతి గుట్టల అటవీ ప్రాంతంలో ప్రైవేటు వ్యక్తులు బుల్డోజర్లతో భారీ వృక్షాలను తొలగించి చదును చేసిన ప్రాంతం

ఇదీ చరిత్ర

హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు మండలాల్లో 3,950 ఎకరాల్లో విస్తరించిన ఇనుపరాతి (దేవునూరు) గుట్టల అటవీ ప్రాంతం గొప్ప జీవావరణంతో నిండి ఉంటున్నది. వరంగల్ నగరం వరకు స్వచ్ఛమైన ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రంగా ఈ ప్రాంతం ఉన్నది. 1927లోనే రిజర్వ్ ఫారెస్ట్‌గా పేర్కొంటూ వేసిన హద్దు రాళ్లు ఉన్నాయి. రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా ప్రకటించాలని 1967లోనే అటవీ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం 1967లోనే ఇనుపరాతి గుట్టలను అటవీ బ్లాక్‌గా గుర్తించారు.సాంకేతికంగా రిజర్వ్ ఫారెస్ట్ కాకపోయినా, దట్టమైన అడవులు ఉన్నాయి. ఈ అడవుల రక్షణ కోసం డీఎఫ్‌వో, రేంజ్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. 1996లో ప్రభుత్వ విధానం మేరకు వనసంరక్షణ సమితి ఏర్పాటు చేసి జాయింట్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (జేఎఫ్ఎం) నిధులతో చెక్ డ్యాంలు, నీటికుంటలు, ఊటచెరువులు, రాక్ ఫిల్ డ్యాంలు (ఆర్ఎఫ్ఎల్) నిర్మించారు. అనేక రకాల మొక్కలను నాటారు. ఆ తర్వాత 2000 సంవత్సరం తర్వాత ఇనుపరాతి గుట్టల ప్రాంతాన్ని సెంట్రల్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (జేఎఫ్ఎం) విభాగంలోకి మార్చాలని ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత ఈ అడవిలో నీటి నిల్వ కందకాలు, కుంటలు, ఫాంపాండ్స్ నిర్మించారు. ఉపాధి హామీలో భాగంగా కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు కేటాయించి అడవిని అభివృద్ధి చేశారు. హరితహారంలో భాగంగా 125 ఎకరాల్లో లక్షల మొక్కలు నాటారు. నాటిన అధికారులే అటవీ భూములను వేరే వారికి ఇచ్చేందుకు దగ్గరుండి చెట్లను నరికేందుకు ప్రయత్నిస్తున్నారు. వీటిని దాటుకొని 2 కిలోమీటర్ల మేరకు ఉన్న భూములు తమవేనంటూ చొచ్చుకు వెళ్లి భారీ మిషన్ల సహాయంతో చదును చేస్తున్నారు.

అటవీ భూమిని నిర్ధారించిన గత సర్కారు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి 3,850 ఎకరాల అటవీ భూమి ఉన్నట్టు నిర్ధారించింది. 343 ఎకరాల సీలింగ్ భూమి ఉండగా, 49 ఎకరాలను 20 మందికి అసైన్ చేశారు. దేవునూరు అటవీ శాఖ ఆధీనంలోని 148.29 ఎకరాలకు 8 మందికి, ముప్పారంలో 58.27 ఎకరాలకు పట్టాలు ఉన్నాయి. అటవీ ప్రాంతంలో ఈ భూములు లేవని నిర్ధారించారు. ఇప్పుడు అడవి ఉన్న ప్రాంతంలో ఈ భూములు లేవని స్థానికులు చెప్తున్నారు. అటవీ శాఖ అధికారు లు అదే నిర్ధారిస్తున్నారు. దాదాపు 70 ఏండ్లుగా అడవులే ఉన్నాయని, సాగు ఎప్పుడూ చేయలేదని నిర్ధారించారు. ఇటీవల కొందరు రైతులు ఎమ్మెల్యే కడియంను కలువగానే అడవిని చదును చేసే పనులను అడ్డుకున్నారు. ధర్మసాగర్ తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది అక్కడికి వెళ్లి అటవీ శాఖ అధికారులను అడ్డుకున్నారు. ధర్మసాగర్ మండలం ముప్పారంలోని 213,214,215,216 సర్వే నంబర్ల భూములు, దేవునూర్‌లోని 403, 404 సర్వే నంబర్ల భూములు అటవీ శాఖకు సంబంధించినవి కావని రెవెన్యూ అధికారులు చెప్పారు. ఇవే సర్వే నంబర్లు అటవీ ప్రాంతంలో ఉండే అవకాశం లేదని అటవీ శాఖ అధికారులు వివరించారు. 48 ఏండ్ల క్రితమే రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించాలని ప్రతిపాదించిన భూములు ఇప్పుడు ప్రైవేటు భూములు ఎలా అవుతాయని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. 70 ఏండ్లుగా అడవిగా ఉంటూ, ఏ ప్రైవేటు వ్యక్తి సాగు చేయని భూములు అడవులుగానే కొనసాగుతాయని వివరించారు. అధికారులే అడవిని తొలగించేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారో అర్థం కావడంలేదని వాపోయారు.

> **అవి అటవీ భూములే**
>
> ఇనుపరాతి గుట్టల పరిధిలోని దేవునూరు భూములు యాభై, అరవై ఏండ్లుగా అటవీ శాఖ ఆధీనంలోనే ఉన్నాయి. కొంత భూమి విషయంలో వివాదాలు ఉన్నాయి. స్పష్టత కోసం ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే చేస్తున్నాం. ఫైనల్ రిపోర్ట్ రాలేదు. రాగానే సమస్యను పరిష్కరిస్తాం.
>
> -అనూజ్ అగర్వాల్, ఇన్‌చార్జి డీఎఫ్‌వో, హనుమకొండ
>
> **ఆ భూములు ఫారెస్ట్‌వి కావు**
>
> ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామ పరిధిలోని 214, 215, 216 సర్వే నంబర్లు, దేవునూర్ పరిధిలోని 403, 404 సర్వే నంబర్లలోని 25 ఎకరాల భూములు అటవీ శాఖ గతంలో ప్రతిపాదించిన రిజర్వు ఫారెస్టు డ్రాఫ్టు నోటి